4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 7 సెప్టెంబర్ 2024
www.ntnews.com

## వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# గురువెవరు, శిష్యుడెవరు ?



కనకదుర్గ దంటు
89772 43484

గురు, శిష్య పరంపర సనాతన ధర్మంలో ఒక ముఖ్యమైన అంశం. ఒక్కొక్కసారి గొప్ప గురువుకు మంచి శిష్యులు దొరకరు. అటు ఉత్సాహవంతులైన శిష్యులున్నా గురువు దొరకకపోవచ్చు. వారిద్దరి ప్రకృతిలో, ఆలోచనల్లో తేడాలుండవచ్చు. కొద్ది ఉదాహరణల్లో శిష్యులు ఎంత గొప్పవారుగా తెలుతారంటే, వారి గురువుల పేర్లు ప్రజలకు తెలియవు. శిష్యుల పేర్లే తెలుస్తాయి. ఆదిశంకరాచార్యులవారి పేరు చాలామందికి తెలుసు. వారి గురువు గోవింద భగవత్పాదులు అని ఎంత మందికి తెలుసు? త్యాగరాజువారి గురువు సొంఠి వెంకటరమణయ్య అని ఎందరికి తెలుసు? అద్భుత రాజకీయ నీతిజ్ఞుడు అటల్ బిహారి వాజపేయి గురువు ఎవరికైనా తెలుసా?

ఏ రంగంలోనైనా ఎవరి ప్రతిభను బట్టి వారు రాణిస్తారు. తమ మేధ, అనుభవం, జీవితాన్ని పరిశీలించిన విధానాన్ని బట్టి వారి ప్రతిభ బయటకు వస్తుంది. గురుశిష్యులకు ఒకేరకమైన పోటీపెడితే తెలుస్తుంది ఎవరి ప్రతిభ ఏమిటో? నందమూరి తారక రామారావు మీద అభిమానంతో, కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పరంపరతో విసిగి కేసీఆర్ 1982లో తెలుగుదేశం పార్టీలో చేరారు. జాతీయ పార్టీలకు రాష్ర్టాల గురించిన అవగాహన పూర్తిగా ఉండదని, ప్రాంతీయ పార్టీ అయితే ప్రజల అవసరాలు త్వరగా గుర్తించడం, తీర్చడం జరుగుతుందని ఆయన భావించారు. పదేండ్ల తర్వాత తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్‌ను దించి ముఖ్యమంత్రి పదవి ఆక్రమించిన చంద్రబాబు నాయుడి పార్టీలో కేసీఆర్ ఉండిపోవలసి వచ్చింది. అయితే చాలా నిజాయితీగా పార్టీ కోసం జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి పథకాలను రూపొందించి చంద్రబాబుకు సహాయం చేశారు. అయితే తరచుగా కేసీఆర్ తన శిష్యుడని చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటు.

చరిత్రలో విచిత్రమైన విషయాలు జరుగుతాయి. తెలంగాణ అన్న పదాన్ని అసెంబ్లీలో ఉచ్చరించకుండా నిషేధించిన చంద్రబాబు అహంకారాన్ని, తెలంగాణకు అప్రతిహతంగా జరుగుతున్న అన్యాయాన్ని చూసి, అవినీతిపరుడైన చంద్రబాబు పార్టీని వదిలి, కేవలం తెలంగాణ ప్రజల కోసం మరో పార్టీని స్థాపించి, 14 ఏండ్లు పోరాడి తెలంగాణ రాష్ర్టాన్ని సాధించారు కేసీఆర్. చంద్రబాబు ఎట్లా ముఖ్యమంత్రి అయ్యారో, తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసి కేసీఆర్ ఎట్లా ముఖ్యమంత్రి అయ్యారనే చరిత్ర ప్రజల కండ్లముందే ఉన్నది.

నిజానికి విచిత్ర సన్నివేశం ఏమంటే.. రాష్ర్టాలు విడిపోయాక ఇటు తెలంగాణకు కేసీఆర్, అటు ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రులు కావడం. కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేసీఆర్ మొట్టమొదటిసారి రాష్ట్ర అధినేత అయ్యారు. అప్పటికే 36 ఏండ్ల రాజకీయ అనుభవం, 9 ఏండ్లు ముఖ్యమంత్రిగా పాలించిన అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు. మరి 2014 నుంచి 2019 దాకా (రెండోసారి ఆంధ్రా ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయారు కాబట్టి) ఈ ఇద్దరు నాయకుల పాలన ఎలా ఉండింది?

**అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల లాగా పరిగెత్తించి రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో కేసీఆర్ నిలిపారు. ముందుగా కరెంట్ కష్టాలు తొలగించి ప్రజలందరికీ మేలు చేశారు. తర్వాత చెరువుల పునరుద్ధరణ, నీటిపారుదల కల్పించి వ్యవసాయరంగాన్ని వృద్ధిపరిచారు. కేవలం ఎనిమిదేండ్లలో 56 లక్షల ఎకరాల నుంచి 1.65 కోట్ల ఎకరాల్లో పంట పండించారు సంతోషంగా తెలంగాణ రైతులు.**



విద్యారంగంలో దాదాపు 1200 గురుకులాల స్థాపన, వైద్యరంగంలో ఆసుపత్రులను పటిష్ఠం చేయడం, కేసీఆర్ కిట్ వంటి పథకాలు సామాన్యుడికి ఊరటనిచ్చాయి. ముసలివారికి పింఛన్లు, ఆడపిల్ల పెండ్లికి కల్యాణలక్ష్మి వంటి పథకాలే కాకుండా, అవసరమైన నిర్మాణాలు రికార్డు సమయంలో పూర్తిచేశారు. రూ.720 కోట్లతో సచివాలయ భవనం, జిల్లాల్లో కలెక్టరేట్లు, పార్కులు, వైకుంఠధామాలు, బీదవారికి విద్యాదానం, డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితబంధు, బీసీ బంధు వంటి పథకాలు అమలుపరిచారు. కుల, మత భేదాలు లేకుండా సనాతన ధర్మంలో చెప్పిన సమానత్వాన్ని పాటించిన నేత కేసీఆర్.

ఇక చంద్రబాబు ఐదేండ్లలో ఒక్క రాజధానికి కావలసిన శాసనసభా భవనం గాని, హైకోర్టు గాని నిర్మించలేకపోయారు. సింగపూర్ నుంచి రాజమౌళి దాకా రకరకాల పేర్లు రంగప్రవేశం చేశాయి. కానీ, ఒక్క నిర్మాణం పూర్తికాలేదు. ప్రజలకు ప్రమాణం చేసిన ఉద్యోగ కల్పన పూర్తికాలేదు. పదేండ్ల తర్వాత నీటమునిగిన అమరావతికి పడవల్లో వెళ్లవలసి రావడమే తప్ప, అక్కడ ఏం జరుగుతున్నదో ఎవరికీ పాలుపోవడం లేదు. జగన్ ప్రతిపాదించిన వికేంద్రీకరణ, మూడు రాజధానులు ముందుకు వెళ్లకుండా ఐదేండ్లు కేసుల మీద కేసులు వేసి ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చారు. చివరికి విడిపోయి పదేండ్లయినా ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని మటుకు ఏర్పడలేదు. ఇది ఎవరి పాపం!

ఆంధ్ర ప్రజలకు ఇంకో అపోహ ఉన్నది. అది తొలగిపోవాలి. వారి నాయకులు ఆంధ్రా నుంచి నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని మేధావులు అనుకునేవాళ్లు కూడా మాట్లాడతారు. నిజానికి హైదరాబాద్‌లో తెలంగాణ నిధులతో ఆంధ్రా నాయకులు, వ్యాపారస్థులు కోటీశ్వరులు అయ్యారు. అంతేకానీ, తెలంగాణకు వారు చేసిందేమీ లేదు. హైదరాబాద్ నగరం 400 ఏండ్ల నుంచీ ప్రపంచంలోనే ఐదవ అద్భుత నగరంగా ఉన్నది. పైగా ఉమ్మడి రాష్ట్ర ఆదాయం చూసినా ఈ విషయం అర్థమవుతుంది. తెలంగాణ జిల్లాల ఆదాయం 66 శాతం, హైదరాబాద్ ఆదాయం 10 శాతం కలిపి ఈ ప్రాంతం 1957 నుంచి 2014 దాకా రాష్ర్టానికి 76 శాతం ఆదాయాన్నిచ్చింది. ఆంధ్రా ప్రాంతం 17 శాతం, రాయలసీమ 7 శాతం ఆదాయాన్నిచ్చాయి. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలే. మరి ఎవరి సొమ్ము ఎవరు తిన్నారు? ఆంధ్రా ప్రజలు వారి నాయకులను అడగాల్సిన ప్రశ్న ఇది. ఇరవై ఏడున్నరేండ్లు రాయలసీమ ప్రాంతం వారు, ఇరవై నాలుగున్నరేండ్లు ఆంధ్రా ప్రాంతం వారు ముఖ్యమంత్రులుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ రెండు ప్రాంతాల నగరాలను ఎందుకు హైదరాబాద్ లాగా తయారుచేయలేదు? అని. ఈ ఆదాయమంతా ఏమైంది? అని.

ఇక ఇప్పుడు ఆంధ్రా రాజధాని విషయానికి వస్తే.. చంద్రబాబు ఆలోచనలు వేరుగా ఉండవచ్చు. 46 ఏండ్ల అనుభవంతో కేసీఆర్‌ను మించిన అద్భుతాలు చేయవచ్చు. కేసీఆర్ 650 మీటర్ల ఎత్తుకి నదీజలాలు తీసుకెళ్లగలిగిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినప్పుడు.. ఆయన గురువునని చెప్పుకొనే చంద్రబాబు నాయుడు బహుశా 650 మీటర్లు భూమి అడుగున రాజధానిని నిర్మిస్తారేమో! అప్పుడు పైన నీళ్లున్నా సబ్‌మెరైన్లలో అమరావతికి చేరుకోవచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ఆశ్చర్యపోయిన అమెరికా శాస్త్రజ్ఞులు.. ద్వారకా నగరం ఇప్పుడున్నట్టు నీళ్ల కింద ఉన్న అద్భుత అమరావతిని చూసి మూర్ఛపోతారేమో! ఎవరు చూశారు!

**ఆంధ్ర ప్రజలకు ఇంకో అపోహ ఉన్నది. అది తొలగిపోవాలి. వారి నాయకులు ఆంధ్రా నుంచి నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని మేధావులు అనుకునేవాళ్లు కూడా మాట్లాడతారు. నిజానికి తెలంగాణ నిధులతో ఆంధ్రా నాయకులు, వ్యాపారస్థులు హైదరాబాద్‌లో కోటీశ్వరులు అయ్యారు. అంతేకానీ, తెలంగాణకు వారు చేసిందేమీ లేదు. హైదరాబాద్ నగరం 400 ఏండ్ల నుంచీ ప్రపంచంలోనే ఐదవ అద్భుత నగరంగా ఉన్నది. పైగా ఉమ్మడి రాష్ట్ర ఆదాయం చూసినా ఈ విషయం అర్థమవుతుంది.**

---

## నివాళి



# గులాబీ గళం ఉద్యమ బలం

**కొందరు రాజకీయంగా ఎంత పెద్ద పదవులు అనుభవించినా.. ప్రజల్లో వారికి అంతగా ఆదరణ ఉండదు. పదవి పోగానే సహజంగా ఆ రాజకీయ నాయకుడు ప్రజలకు దూరంగా ఉండాలని చూస్తాడు. అలా పదవులు అనుభవించినంత కాలం ప్రజల్లో ఉండి హోదా, పలుకుబడి రాగానే మానవత్వాన్ని మరిచే రాజకీయ నాయకులు ఎందరో. కొందరు అలా కాదు. రాజకీయ పదవులు చేపట్టకపోయినా.. వారు చేసిన ప్రజా సేవలను బట్టి చరిత్రలో వారికంటూ ఓ గుర్తింపు ఉంటుంది. అటువంటి గొప్ప ప్రజా సారథి, సేవకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి.**



సంపత్ గడ్డం

తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాదు, అంతకుముందునుంచే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జిట్టా బాలకృష్ణారెడ్డి ఎంతగానో పరితపించేవారు. నల్లగొండ జిల్లాలో పుట్టిన ఆయన తన జన్మభూమి ఎదపై గుదిబండగా మారిన ఫ్లోరైడ్ రక్కసిని తరిమికొట్టేందుకు అహర్నిశలు శ్రమించారు. భువనగిరి నియోజకవర్గవ్యాప్తంగా తాగునీటి వాటర్ ప్లాంట్లను ప్రారంభించి నిజమైన సేవకుడినని నిరూపించుకున్నారు. రాజకీయంగా కలిసి వస్తే విధానపరమైన నిర్ణయాలతో ప్రజలకు మరింతగా సేవ చేయాలని ఆయన సంకల్పించారు. కానీ, ఆయన అనుకున్నది జరగలేదు. అయినప్పటికీ ఏనాడూ ఆయన ప్రజలకు దూరం కాలేరు. ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ జిట్టా ఉండేవారు.

ప్రజాప్రతినిధి కాలేకపోయినా, ప్రజా నాయకుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న జిట్టా తెలంగాణ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు. 2001లో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ మలివిడత ఉద్యమం ప్రారంభం కాగానే నల్లగొండ నుంచి తొలి పిడికిలి ఎత్తింది జిట్టానే. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత యువజన విభాగానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాడే ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ శకటాన్ని ప్రదర్శించేలా ఆయన కృషిచేశారు. నల్గొండ వ్యాప్తంగా ఉద్యమ నిర్మాణ జెండా గద్దెలు నిర్మించి ఊరూరా చైతన్యం నింపిన నిస్వార్థ సేవకుడు.

అంతేకాదు, స్వరాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో తన ఆస్తులను ధారపోశారు జిట్టా. వందల కోట్ల రూపాయల ఆస్తులను ప్రజా ఆకాంక్షల కోసం త్యాగం చేశారు. ఉద్యమానికి సర్వస్వం అర్పించిన జిట్టాకు రాజకీయంగా మాత్రం ఏదీ కలిసిరాకపోవడం విచారకరం. దీంతో రాజకీయ సమీకరణాల కారణంగా 2009లో ఆయన టీఆర్ఎస్‌ను వీడాల్సి వచ్చింది. అయితే ఏ పార్టీలో చేరినా ఆయనకు మోసమే ఎదురైంది. ఈ నేపథ్యంలో ఆయనే స్వయంగా యువ తెలంగాణ పార్టీని స్థాపించి రాజకీయంగా మార్పు తేవాలని భావించారు. అడుగడుగునా అణచివేత, స్వార్థంతో నిండిన ఈ రాజకీయ వ్యవస్థలో ఆయన ఇమడలేకపోయారు. నిఖార్సయిన తెలంగాణవాదిగా ఉండి మోసపోయానని గుర్తించిన జిట్టా 2018లో మళ్లీ ఉద్యమ పార్టీలో చేరారు.

**కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని భావించిన జిట్టా మరోసారి గులాబీ పార్టీ తరపున గళమెత్తారు. బహుశా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆయనకు సముచితమైన స్థానం దక్కేదేమో. స్వల్ప తేడాతో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ప్రత్యక్షంగా రాజకీయ సేవ చేసే అవకా శం రాలేదు. కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం ఉంచి, ప్రజా సేవ చేస్తున్న ఆయనను అనారో గ్యం వెంటాడింది. కాలం కలిసివచ్చే సమయానికి నిస్వార్థ సేవకుడిని ప్రజలకు దూరం చేసింది.**

స్వరాష్ట్ర సాధన కోసం జిట్టా బాలకృష్ణారెడ్డి చేసిన కృషి చరిత్రాత్మకం. ఆయన సేవలను తెలంగాణ ప్రజలు, మరీ ముఖ్యంగా ఉద్యమాల గడ్డ నల్లగొండ ప్రజలు ఎన్నటికీ మరువరు. అలుపెరగని ప్రజానాయకుడిగా ఆయన తెలంగాణ చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. భువనగిరి గడ్డ జిట్టా బాలకృష్ణారెడ్డికి రాజకీయంగా అండగా నిలబడకపోయినా.. ప్రజల కోసం పరితపిస్తూ ఆయన చేసిన సామాజిక సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మలిదశ ఉద్యమంలో జిట్టా బాలకృష్ణారెడ్డి చూపిన చొరవ, చైతన్యం, నాయకత్వాన్ని భవిష్యత్తు తరాలు పదిలంగా దాచుకుంటాయి.

---

### లేఖ

## ఆదర్శ అధ్యాపకుల అభ్యర్థన ఆలకించరూ!

*ఒక అధ్యాపకుడు ఒకే విద్యాసంస్థలో పదకొండేండ్ల పాటు నిరంతరాయంగా పనిచేయడమనేది మామూలు విషయం కాదు. కుటుంబాలకు, పిల్లలకు దూరంగా ఉంటూ సొంతూళ్లకు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటూ పనిచేయడం వల్ల మానసికంగా కుంగుబాటుకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల అధ్యాపకులు ప్రస్తుతం ఈ బాధను అనుభవిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఉద్యోగంలో నియమితులైన చాలా మంది అధ్యాపకులు ఇప్పటికీ ఒకేచోట పనిచేస్తుండటం గమనార్హం. అదే సమయంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోని ఆదర్శ పాఠశాలల్లోని అధ్యాపకులకు రెండు, మూడుసార్లు బదిలీలు జరిగినట్టు సమాచారం. కోర్టు కేసుల కారణంగా బదిలీలు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. కానీ, కోర్టు కేసులు ఉండగానే.. ఇతర విభాగాల పరిధిలోకి వచ్చే ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయనే విషయాన్ని మరిచిపోరాదు. వారి బదిలీలు న్యాయస్థానాల తుది తీర్పులకు లోబడే జరిగాయి. కాబట్టి బదిలీల ప్రక్రియను ఇప్పటికైనా చేపట్టాలి.*

*మరోవైపు ఒకే ఉద్యోగ ప్రకటన ద్వారా నియామకమైన ఏపీలోని అధ్యాపకులకు బదిలీలతో పాటు 010 పద్దు కింద వేతనాలు పెరిగాయి. అంతే కాదు, పాఠశాల విద్యాశాఖలో విలీనం కూడా చేశారు. కానీ, తెలంగాణలో మాత్రం అలాందేమీ జరగలేదు. అధ్యాపక సంఘాల మధ్య సమన్వయం లేకపోవడమే సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడానికి ప్రధాన కారణం. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు సంఘాలు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అందుకే ఇప్పటికైనా ఆదర్శ పాఠశాలల అధ్యాపకులు కలిసికట్టుగా ఉంటూ సమస్యల సాధనకు పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నది. తద్వారా 010 పద్దు కింద వేతనాలు చెల్లింపుతో పాటు బదిలీలు లాంటి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవచ్చు.*

***– డాక్టర్ కావలి చెన్నయ్య, ముదిరాజ్***
***90004 81768***


---

# మూగబోయిన లలిత గీతం!

**ఉద్యమకాలంలో ఉవ్వెత్తున ఎగసిన పోరు పాట మూగవోయింది! లలిత సినీ గేయ రచనలో ఒక ఒరవడిని సృష్టించిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ 76 ఏండ్లకే పరమపదించారు. జీవితాంతం లలిత కళకు అంకితమైన ఆయన తన చివరి రోజుల్లోనూ కళామతల్లికి సేవలందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాటల తూటాలెక్కుపెట్టిన ఆయన జన్మభూమి రుణం తీర్చుకున్నారు.**



ఎడిటోరియల్ డెస్క్



నివాళి

తెలంగాణ సాహిత్యానికి వడ్డేపల్లి కృష్ణ చేసిన సేవ అపారం. ఆయన పాటలు ఉద్యమానికి ఊతమై చిందులు వేశాయి. ఇటీవల తెలుగు సినీ రచయితల సంఘం జీవన సాఫల్య పురస్కారంతో ఆయనను సత్కరించింది. ఇది జరిగిన కొన్నిరోజులకే ఆయన తీవ్ర అనారోగ్యం పాలై తుది శ్వాస విడవటం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు.


సిరిసిల్ల జిల్లాలోని ఓ చేనేత కుటుంబంలో జన్మించిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తపాలాశాఖలో పదవీ విరమణ చేసిన ఆయనకు లలిత కళలంటే ఎంతో మక్కువ. లలిత కళలకు తన జీవితాన్ని ధారపోసిన ఆయన అనేక గీతాలను రచించారు. పిల్ల జమీందార్ చిత్రంలో 'నీ చూపులోన విరజాజి వాన', పెద్దరికం సినిమాలోని 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', భైరవ ద్వీపం చిత్రంలో 'అంబా శాంభవి'.. సహా అనేక ఆణిముత్యాల్లాంటి గీతాలను రచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'జయ జయహే తెలంగాణ' నృత్య రూపకం రచించగా అన్ని వేదికలపై అది మార్మోగింది. సాహిత్యరంగంలో 25 ప్రక్రియల్లోనూ రచనలు చేసిన ఏకైక రచయితగా వడ్డేపల్లి కృష్ణ ప్రత్యేక గుర్తింపును పొందారు.

వందేండ్లలో వెలువడిన పది వేల లలిత గీతాలపై పరిశోధనలు చేసిన వడ్డేపల్లి.. పీహెచ్‌డీ కూడా అందుకున్నారు. ఆయన రచించిన వందలాది లలిత గీతాలు ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రసారమయ్యా యి. 40 పైగా నృత్యరూపకాలు కూడా రాశారు. ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు.

**రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఎక్కడికి వెళ్తుందో మనసు' చిత్రంలో సాయికుమార్ హీరోగా నటించారు. ఇటీవల కాలంలో సంచలనం సృష్టించిన బలగం సినిమాలో ఓ కీలక పాత్ర పోషించారు.**

తన సాహిత్య జీవితంలో ఆయన ఎన్నో పురస్కారాలందుకున్నారు. ఆటా, తానా వేడుకల్లో, సాహి త్య చర్చల్లో పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన దర్శకత్వం వహించి, నిర్మించిన 'గోభాగ్యం' లఘుచిత్రానికి అంతర్జాతీయంగా అనేక పురస్కారాలు లభించాయి. 'బతుకమ్మ', 'రామప్ప రామణీయం' లాంటి అనేక లఘు చిత్రాలకు నంది పురస్కారాలు వరించాయి. ఈ సందర్భంగా వడ్డేపల్లికి అశ్రునివాళి. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి.

---




# పోరాటం ఇంకా ఉంది!



**ఢిల్లీ రోడ్లపై మమ్మల్ని ఈడ్చుకెళ్లినప్పుడు బీజేపీ తప్ప అన్ని పార్టీలు మాకు అండగా నిలిచాయి. మా కష్టాల్ని, కన్నీళ్లను అర్థం చేసుకున్నాయి. ఒకవేళ నేను అనుకొని ఉంటే, జంతర్‌మంతర్ వద్దే రెజ్లింగ్‌ను వదిలేసేదాన్ని. కానీ, అలా చేయలేదు. ఒలింపిక్స్ ఫైనల్‌కు చేరుకున్నా. అయితే దేవుడు వేరే ప్లాన్ రచించాడు. ఇప్పుడు దేశానికి సేవ చేసేందుకు మరో అవకాశం ఇచ్చాడు. నా పోరాటం ఇంకా ముగియలేదు. ఆపదలో ఉన్న నా సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా.**

**- వినేశ్ ఫోగట్, రెజ్లర్**